క్లుప్తంగా

భాగవత సప్తాహంతో ప్రశాంత జీవనం

పులివెందుల టౌన్ : ప్రస్తుత పరిస్థితులలో భాగవత సప్తాహంతో ప్రశాంతంగా జీవించవచ్చునని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని గీతామందిరంలో భాగవత సప్తాహం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ఆధునిక మానవుడు అన్ని ఉండి కూడ అశాంతితో జీవిస్తున్నాడన్నారు. భాగవత సప్తాహం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానవునికి ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో భాగవత పండితులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లింగాల : మండలంలోని తాతిరెడ్డిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కెపాసిటర్ బ్యాంకు ఇంటరనల్ వర్క్ కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ బాల సంజీవులు తెలిపారు. ప్రజలు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

లింగాల : మండలంలోని అంబకపల్లె ఘాట్ దగ్గర గురువారం ఉదయం కోడి పందేల స్థావరాలపై దాడిచేసి 8 మంది కోడి పందెంరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. తమకు సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో దాడి చేసి 9 కోళ్లతోపాటు రూ.8730 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా చైతన్యకుమార్



వేంపల్లె : స్థానిక రజకవీధికి చెందిన చైతన్యకుమార్ సేవలను గుర్తించి ఏబీఆర్ఎస్ జాతీయ కార్యాలయం నుంచి అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ గురువారం అఖిల భారత రజక సంఘం జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా చైతన్యకుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎదుర్కొంటున్న రజకుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా పోరాటం చేస్తానన్నారు. అయా ప్రాంతాల్లో రజకులకు ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

హామీలు నిలబెట్టుకోకుంటే ఉద్యమిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఎన్నికల ప్రచార సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇచ్చిన ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయకపోతే ఉద్యమిస్తామని ఎస్టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథ్ రెడ్డి హెచ్చరించారు. కడపలోని ఎస్టీయు భవన్‌లో గురువారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులు వారి జీతాలు మినహా మరి ఏ ఇతర ఆర్థిక పరమైన లబ్ధి పొందలేదన్నారు. 12వ వేతన సవరణ సంఘం సంబంధించిన కమిషన్ ఏర్పాటు ప్రక్రియ మొదలే పెట్టలేదని, ఇప్పటికే 19 నెలలు ఆలస్యమైందన్నారు. వెంటనే ప్రభుత్వం మధ్యంతర భృతిని ప్రకటించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతోందని, ఇప్పటికీ ఎన్నికల హామీలైన బకాయిల చెల్లింపు, 12వ పీఆర్సీ అంశాలపై ఉద్యోగ సంఘాలను చర్చలకే ఆహ్వానించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొర్ర సురేష్‌బాబు, కంభం బాలగంగి రెడ్డి , జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, నరెడ్డి సంగమేశ్వర్ రెడ్డి, నాయకులు రవిశంకర్ రెడ్డి, చెన్నకేశవరెడ్డి, రెడ్డన్న, వెంకట సుబ్బయ్య, సాదిక్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా 4వ మహాసభలు జయప్రదం చేయాలి

పోరుమామిళ్ల : ఈనెల 21, 22 తేదీల్లో కడపలో నిర్వహిస్తున్న ఆటో కార్మికుల (ఏఐటీయూసీ) జిల్లా 4వ మహాసభలను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా నాయకులు రవికుమార్ పిలుపిచ్చారు.

గురువారం స్థానిక ఆటో స్టాండు వద్ద మహాసభల కరపత్రాలను వారు విడుదల చేసి మాట్లాడారు. రవాణా రంగంలో ఉన్న లక్షలాది ఆటో కార్మికులకు భద్రత కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. నూతన రోడ్డు రవాణా చట్టం తెచ్చి కార్మికులను జైలుకు పంపే పరిస్థితి తెచ్చారన్నారు. ఆటో కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించడానికి ఆటో రంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయాలన్నారు. ఆటో కార్మికులకు బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు ఇప్పించి ఆదుకోవాలన్నారు. ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖపై బకాయిల బండ

- పేరుకుపోతున్న ప్రభుత్వ శాఖల బిల్లులు
- ఎర్రగుంట్ల పట్టణ విద్యుత్‌సబ్ స్టేషన్‌లో రూ.1.86 కోట్లు



ఎర్రగుంట్ల పట్టణానికి విద్యుత్‌ను సరఫరా చేసే సబ్ స్టేషన్

ఎర్రగుంట్ల : విద్యుత్ శాఖ ఎర్రగుంట్ల పట్టణ సబ్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వ శాఖలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ప్రభుత్వం సకాలంలో నిధులను విడుదల చేయడం లేదు. దీంతో విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా బకాయిలు పేరుకుపోయాయి.

డిసెంబర్ నాటికి రూ.1.86 కోట్ల బకాయిలు

ఎర్రగుంట్ల పట్టణ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ శాఖలు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు డిసెంబర్ నాటికి రూ.1.86 కోట్లు ఉన్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు సంబంధించి మూడు నెలలకోసారి ప్రభుత్వ నిధులు విడుదల చేయాలి. అయితే నిధుల కొరత కారణంగా సకాలంలో విడుదల చేయడం లేదు. దీంతో సకాలంలో బిల్లులను చెల్లించలేని పరిస్థితి నెలకొంటుంది. ఫలితంగా విద్యుత్ బకాయిలు కొండలా పేరుకుపోతున్నాయి. ప్రధానంగా పోలీస్‌స్టేషన్, ఆసుపత్రులు, విద్యా సంస్థలు, దోబీఘాట్‌లు, ఎర్రగుంట్ల మున్సిపాలిటీ వాటర్ వర్క్స్, సచివాలయం, తహసీల్దార్ కార్యాలయంలకు సంబంధించిన బకాయిలు ఎక్కువగా ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు నిధులు అంతంత మాత్రంగా వస్తుండటంతో వీధి దీపాలు, మంచినీటి పథకాలకు సబంధించిన బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంటుంది.

ప్రభుత్వ శాఖల నుంచే అధికంగా బకాయిలు

ఎర్రగుంట్ల పట్టణ పరిధిలో ఉన్న ప్రభుత్వ శాఖ కార్యాలయాలనుంచే అధికంగా విద్యుత్ బిల్లులు బకాయిలు ఉన్నాయి. వాటిని ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసి విద్యుత్ శాఖకు చెల్లిస్తే మా టార్గెట్ తగ్గిపోతుంది. గృహ నిర్మాణశాఖ సముదాయం నుంచి కూడా వినియోగదారులు సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్ శాఖకు సహకారించాలి.

– ప్రియదర్శినిరెడ్డి, ఏఈ, ఏపీఎస్‌పీడీసీఎల్, ఎర్రగుంట్ల.

శాఖల వారీగా బకాయిలు ఇలా...

ఏపీ ఫైబర్ నెట్	రూ.47,239.00
దోబీఘాట్	రూ.60,738.00
వెటర్నీ ఆసుపత్రి	రూ.40,927.00
ఎమ్మార్వో ఆఫీసు	రూ.10,61,251.00
మున్సిపాలిటీ వాటర్, వీధిలైట్లు	రూ.1,25,82,931.00
పోలీస్‌స్టేషన్	రూ.7,09,420.00
సచివాలయం	రూ.33,136.00
విద్యాశాఖ	రూ.3.78,313.00
మొత్తం	రూ.1,67,69,701.00
పెద్దనపాడు వాటర్ వర్క్స్	రూ.18,42,599.00
అంగన్‌వాడీ	రూ.13,147.00
మొత్తం	రూ.1,85,5746.00

రెవెన్యూ శాఖలో భారీగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. ఆదాయం కూడా బాగానే వస్తోంది. అయినా ఈ శాఖ కూడా బకాయి బారీగా ఉండటం గమన్హారం. విద్యుత్‌శాఖ బిల్లుల బకాయిల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రీపెయిడ్ మీటర్లను తీసుకొస్తోంది. ఇప్పటికే ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రీపెయిడ్ మీటర్లను ఏర్పాటు చేసింది. అయితే అవి సాంకేతికంగా పనిచేయడం ఇంకా మొదలు కాలేదు. ఆ మీటర్లు పనిచేయడం మొదలైతే విద్యుత్ శాఖకు ప్రభుత్వ కార్యాలయాల బకాయిల బెడద శాశ్వతంగా తొలగిపోతుంది.

నేటి నుంచి పింఛన్ల పరిశీలన

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా ఉన్న సామాజిక పింఛన్లను శుక్రవారం నుంచి పరిశీలించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మొదటగా మంచానికి పరిమితమైన వారు 30 మంది, 5 మంది పెరాలసిస్ బారినపడిన వారి పింఛన్లను పరిశీలిస్తామన్నారు. తర్వాత వికలాంగుల పింఛన్లను పరిశీలిస్తామన్నారు. మండల వ్యాప్తంగా 5340 మంది పింఛన్ లబ్ధిదారులు ఉన్నారన్నారు.

పందుల తరలింపు



పందులను తరలిస్తున్న పెంపకం దారులు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని పందుల తరలింపు, పారిశుద్ధ్యంపై మున్సిపల్ కమిషనర్ శేషఫణి చర్యలు చేపట్టారు. ఈనెల 14వ తేదీన సాక్షిలో ప్రచురితమైన పడకేసిన పారిశుద్ధ్యం.. అధికారుల చోద్యంపై అనే కథనంకు స్పందన లభించింది. ఈ సందర్భంగా మున్సిపల్ పరిధిలో ఉన్న పందులను పట్టుకుని బయటకు తరలిస్తున్నారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ పరిధిలోని పందుల పెంపకం దారులు బృందాలుగా ఏర్పాడి అన్ని విధులలో ఉన్న పందులు పట్టుకుని బయటకు తరలించారని ఆయన తెలిపారు. అలాగే పారిశుధ్యంపై కూడా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్బం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్ల పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవినొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం , చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

ఇళ్ల మధ్యలోని విద్యుత్ లైన్లను తొలగించాలి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో పలు వీధులలో ఉన్న 33 కేవీ విద్యుత్ లైన్లను తొలగించాలని లేకుంటే ప్రమాదాలు మరింత జరిగే అవకాశముందని పలువురు అంటున్నారు. 6వ వార్డులో 33 కేవీ విద్యుత్ లైన్ తగిలి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు జయంత్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. పట్టణంలోని 33 కేవీ విద్యుత్ లైన్‌లు 6వ వార్డులోని క్రాంతినగర్ కాలనీలో, 8వ వార్డులోని పుష్పగిరి మాన్యంలో, 13వ వార్డులోని శాంతినగర్ కాలనీలలో ఉన్నాయన్నారు. పుష్పగిరి మాన్యంలో గతంలో ఓ చిన్నారికి గాయాలు కాగ, శాంతినగర్ కాలనీలో విద్యుత్ తీగలు తగలి ఓ వ్యక్తి మృతి చెందారని ఆయన గుర్తు చేశారు. వీటిని తొలగించాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు.

విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలి



శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓ

కమలాపురం : ప్రతి రైతు పంటల సాగుకు 24 గంటల ముందే విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె, వంకమాడ గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో వారు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. పంటల సాగుకు 24 గంటల ముందే ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పని సరిగా చేసుకోవాలన్నారు. అలగే రైతులు ఇ-పంటను నమోదు చేసుకోవడంతో పాటు ఇ-కేవైసీ చేసుకోవాలన్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లో నూగు, పెసర, వేరు శనగ పంటలను విత్తు కోవచ్చన్నారు. నూగులో వైఎల్ఎం-66,11,17 వంటి రకాలు మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. అలాగే వేరుశగనలో టీసీజీఎస్-1694 విత్తనం విత్తు కోవాలనుకునే రైతులు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం నుంచి విత్తనాలను పొందవచ్చన్నారు. పెసరలో ఎల్‌జీజీ 460, 407, టీఎం96-2, ఐపీఎం2-14, డబ్ల్యుజీజీ-42 వంటి రకాలను విత్తు కోవచ్చన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించాలన్నారు. తద్వారా తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయం గడించవచ్చన్నారు. వీఏఏ బాబు, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలను పాటించాలి



పులివెందులలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ, ఎంవీఐ, సీఐలు, తదితరులు



జమ్మలమడుగు : సమావేశంలో మాట్లాడుతున్న సీఐ లింగప్ప

పులివెందుల రూరల్ : వాహనదారులందరూ రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. గురువారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో 36వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా డీఎస్పీ మురళీనాయక్ చేతుల మీదుగా రోడ్డు భద్రతా వారోత్సవా ల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు గురించి ప్రజలు, వాహనాదారులకు తప్పనిసరిగా అవగాహన కల్పించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవించి నడపరాదన్నారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు. అనంతరం ఎంవీఐ బి.వి.ప్రసాద్ మాట్లాడుతూ జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా పదిరోజులపాటు అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా వాహనాలలో దూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు వాడాలన్నారు. అర్బన్ సీఐ నరసింహులు, ట్రాఫిక్ సీఐ హాజీవలి, ఆర్టీసీ డీఎం రామకృష్ణ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

జమ్మలమడుగు : ఆర్టీసీలో పనిచేసే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి ప్రమాదాలను నివారించుకుందామని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. గురువారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా డిపో మేనేజర్ ప్రవీన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరం అన్న సూక్తిని దృష్టిలో పెట్టుకుని డ్రైవర్లు ప్రయాణికుల భద్రతే ధ్యేయంగా విధులను నిర్వహించాలన్నారు. డ్యూటీలకు వెళ్లేటప్పుడు డ్రైవర్లు తమకుటుంబ సభ్యులను గుర్తిచేసుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో ప్రశాంతతతోపాటు ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం అన్నారు. కార్యక్రమంలో ఏబీఎం పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామోత్సవం



దేవగుడిలో సీతా రాముల ఉత్సవ విగ్రహలను ఊరేగిస్తున్న భక్తులు

జమ్మలమడుగు రూరల్ : మండల పరిధిలోని దేవగుడి గ్రామంలో కనుల పండువగా శ్రీ సీతా రాముల గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గురువారం సంక్రాంతి ఉత్సవాల భాగంగా శ్రీ సీతా రాముల ఉత్సవ విగ్రహలను ట్రాక్టర్‌లో పెట్టుకుని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేత్రదానంతో అంధులకు చూపు



మృతురాలి కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను సేకరిస్తున్న రాజు

పులివెందుల రూరల్ : నేత్రదానం చేయడంవల్ల అంధులకు చూపు వస్తుందని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. గురువారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కోగటం రామసుబ్బమ్మ మరణించింది. ఈ నేపథ్యంలో మృతురాలి కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరిస్తూ జిలా నేత్ర సేకరణ కేంద్రానికి సమాచారమిచ్చారు. రాజు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతురాలి ఇంటి వద్దకు వెళ్లి మృతదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ బంధువులు, సన్నిహితులు మరణించినా 9966609364, 7093204537లకు సమాచారమిస్తే మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలను దానం చేయడంవల్ల అంధులకు చూపునివ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిష్ వెంకటరెడ్డి, కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వృథాగా పోతున్న బుగ్గడ్యాం నీరు



వృథాగా పోతున్న బుగ్గ డ్యామ్ నీరు

చింతకొమ్మదిన్నె : బుగ్గవంక డ్యామ్ నుంచి రెడ్డిచెరువుకు నీరు నింపడానికి బుగ్గవంక ఎడమ కాలువ నుండి నీరు వదిలారు. అయితే రెడ్డిచెరువు నెల రోజుల కిందటే నిండినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో రెడ్డిచెరువు నిండి వృథాగా పోతోందని స్థానిక రైతులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుగ్గవంక డ్యాములో నీరు నిలువవుంటే రానున్న వేసవి కాలానికి భూగర్భ జలాల స్థాయి పెరుగుతుందన్నారు. వేసవి కాలానికి బోర్లు ఎండిపోకుండా ఉంటాయన్నారు. ఇరిగేషన్ అధికారులు వృథాగా పోతున్న నీటిని పరిశీలించి, బుగ్గడ్యాం నీటి వృథాను ఆపాలని మండల రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఆయా, స్వీపర్‌ల జీతాలు పెంచాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చాంద్‌బాషా

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఆయాలు, స్వీపర్ల జీతాలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు చాంద్‌బాష తెలిపారు. గురువారం పట్టణంలోని మార్క్స్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస వేతనం 108 జీఓ ప్రకారం రూ.11,500 వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, పని భద్రత కల్పించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి శరత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లకు నిలయమైన టిడ్కో ఇళ్లు





కంపచెట్లతో నిండి కనీస వసతులకు నోచుకోని టిడ్కో ఇళ్లు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని ఇళ్లులేని పేదలకు నిర్మించిన టిడ్కో ఇళ్లన్నీ కంపచెట్లతో నిండిపోయాయి. లబ్ధిదారులకు కేటాయించిన ఇళ్లకు కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో రూ.వేలాది కోట్లుతో నిర్మించిన ఇళ్లన్ని నిరుపయోగంగా ఉన్నాయి. 2018 సంవత్సరానికి ముందు అప్పుడు చంద్రబాబు హాయంలో టిడ్కో ఇళ్లను నిరుపేదలకు మంజూరు చేశారు. వాటిని లబ్ధిదారులకు బ్యాంక్‌లో రుణాలు ఇప్పించి నెలవారి కంతులు ప్రకారం చెల్లించే విధంగా అప్పట్లో చంద్రబాబు వీటికి గుంతలు తీసి పూనాలు వేశారు. తర్వాత 2019 నుంచి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చెపట్టారు. లబ్ధిదారులకు రుణం భారం లేకుండా ఉచితంగా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించారు. రూ.కోట్లు మంజూరు చేసి టిడ్కో ఇళ్లను నిర్మించారు. అయితే తర్వాత జరిగిన ఎన్నికల్లో చంద్రబాబు సీఎం అయ్యారు. సుమారు 7 నెలలు దాటినా ఇప్పటి వరకు ఇళ్లలో కనీస సదుపాయాలు కల్పించలేదు. ఇళ్లను పూర్తి చేసి వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

18,19 తేదీల్లో రజతోత్సవాలు

కడప కల్చరల్ : కడప రెడ్డిసేవా సమితి రజతోత్సవాలను ఈనెల 18, 19 తేదీల్లో నగర పరిధిలోని డీఎస్ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి లెక్కల కొండారెడ్డి, సభ్యులు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా 18న మేలుకొలుపు పేరిట ప్రచురించనున్న రజతోత్సవ ప్రత్యేక సంచికను ముఖ్య అతిథులు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ నాగార్జునరెడ్డి ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. 19న ఉదయం 10 గంటలకు రాజీవ్‌మార్గ్‌లోని రెడ్డి సేవా సమితి కార్యాలయం వద్ద నుంచి వేమన విగ్రహం వరకు ర్యాలీ నిర్వహిస్తామని, అనంతరం వేమన విగ్రహానికి పూలమాల అలంకరిస్తామని తెలిపారు.